

**అమ్మపేరుతో..**
అమ్మపేరుతో ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి సంరక్షించాలని ఎంపీడీఓ జర్నప్ప సూచించారు. 8లో▸



దుద్యాల్: ధర్నాలో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకులు, రైతులు



అనంతగిరి: ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, పార్టీ నాయకులు, కార్యకర్తలు



దుద్యాల్: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసిన ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి



పరిగి: తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, పార్టీ శ్రేణులు



తాండూరు: ధర్నా శిబిరంలో ప్రసంగిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సందల్ రాజు

రైతులందరికీ రుణమాఫీ చేయాలనే డిమాండ్‌తో బీఆర్‌ఎస్ పార్టీ గురువారం చేపట్టిన రైతు ధర్నా జిల్లాలో విజయవంతమైంది. మండల, నియోజకవర్గ కేంద్రాల్లో మాజీ ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు రైతులతో కలిసి ప్రభుత్వ తీరుకు నిరసనగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. రోడ్లపై బైఠాయించి ధర్నా చేశారు. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఇచ్చిన మాటకు కట్టుబడి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులందరికీ మాఫీ చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన కార్యక్రమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

– సాక్షి నెట్‌వర్క్

## న్యూస్‌రీల్

### యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం



కోట్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో సభ్యత్వ నమోదు చేస్తున్న వెంకటరత్నం

**బంట్వారం:** విద్యాహక్కు చట్టం అమలులో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం ఆరోపించారు. గురువారం కోట్‌పల్లి మండలంలోని పలు పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో యూటీఎఫ్ ఎప్పుడూ ముందు ఉంటుందన్నారు. పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం మరింతగా కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలన్నారు.

### తాండూరు సబ్ కలెక్టర్‌గా ఉమాశంకర్ ప్రసాద్



**తాండూరు:** తాండూరు నూతన సబ్ కలెక్టర్‌గా 2022 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి ఉమాశంకర్ ప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గురువారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. త్వరలోనే ఆయన విధుల్లో చేరనున్నారు.

### టెంకాయల విక్రయానికి వేలం



వేలం నిర్వహిస్తున్న అధికారులు

**కుల్కచర్ల:** మండలంలోని శ్రీ పాంబండ రామలింగేశ్వర స్వామి ఆలయంలో చిన్న జాతరను పురస్కరించుకుని టెంకాయలు విక్రయించేందుకు గురువారం బహిరంగ వేలం నిర్వహించారు. బండవెల్కిచర్ల గ్రామానికి చెందిన కంకంటి వీరప్ప లక్ష వెయ్యి రూపాయలకు వేలం హక్కులు పొందారు. ఈ నెల 26 నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు ఆలయ ప్రాంగణంలో టెంకాయలు విక్రయించుకోవచ్చని ఆలయ చైర్‌పర్సన్ నర్సమ్మ, ఈఓ సుధాకర్ తెలిపారు. కార్యక్రమంలో వేలం పరిశీలకులు శ్రీనివాస్‌రెడ్డి, అర్చకులు పాండు శర్మ పాల్గొన్నారు.

### విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యం: ఎస్పీ



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ

**బొంరాస్‌పేట:** పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉంటూ, విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్పీ కే నారాయణరెడ్డి సిబ్బందికి సూచించారు. గురువారం బొంరాస్‌పేట పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. మండలంలో నమోదవుతున్న కేసుల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విధి నిర్వహణ తోపాటు ఆరోగ్యం కూడా ముఖ్యమన్నారు. కరోనా తర్వాత పోలీసుల ఆరోగ్యం కాస్త దెబ్బతినిందన్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా ఉండాలని సూచించారు. డయల్ 100కు కాల్ వస్తే వెంటనే స్పందించాలని తెలిపారు. స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. ఇటీవల గుప్తనిధుల తవ్వకాల కేసును ఛేదించిన కానిస్టేబుళ్లు బాలు, శ్రీనుకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ఎండీ రావూఫ్‌ను అభినందించారు. డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి, సీఐ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

### కేజీబీవీల్లో బదిలీలు

**అనంతగిరి:** జిల్లాలోని 18 కేజీబీవీల్లో కాంట్రాక్టు పద్ధతిన పని చేస్తున్న ఎస్‌ఓ, పీజీసీఆర్‌టీ, సీఆర్‌టీ, పీఈటీ, ఏఎన్‌ఎం, అకౌంటెంట్లు కోరుకున్న ప్రాంతానికి బదిలీ చేయాలని రాష్ట్ర సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ నుంచి ఉత్తర్వులు అందాయని డీఈఓ రేణుకాదేవి తెలిపారు. గురువారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. కొత్త జిల్లాల ప్రాతిపదికన జరిగే ఈ ప్రక్రియలో రెండు సంవత్సరాలు ఒకే చోట సర్వీసు పూర్తయిన వారు లబ్ధి పొందుతారని తెలిపారు. బదిలీల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వివరించారు. వచ్చే నెల 5వ తేదీతో బదిలీలు, నియామకాల ప్రక్రియ ముగుస్తుందన్నారు.

# కొర్రీలు కోతలు వద్దు



చేవెళ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు, రైతులు

## రూ.2 లక్షల రుణమాఫీ చేయాల్సిందే: మాజీ మంత్రి కేటీఆర్



రైతు నిరసన దీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి చిత్రంలో మాజీ మంత్రి కేటీఆర్, శంభీపూర్‌రాజు, మహమూద్ అలీ తదితరులు

- చేవెళ్లలో బీఆర్‌ఎస్ రైతు నిరసన దీక్ష
- భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు, రైతులు

**చేవెళ్ల:** రైతు రుణమాఫీపై బీఆర్‌ఎస్ పోరుబాట పట్టింది. చేవెళ్ల పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ సమీపంలో మాజీ మంత్రి సబితారెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకుడు కార్తీక్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన రైతు నిరసన దీక్ష విజయవంతమైంది. ఈ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ హాజరయ్యారు. చేవెళ్ల మార్కెట్ యార్డ్ వద్ద పార్టీ నాయకులు కేటీఆర్‌కు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి ర్యాలీగా దీక్షా శిబిరం వద్దకు పాదయాత్రగా చేరుకున్నారు. చేవెళ్ల, షాబాద్, మొయినాబాద్, శంకర్‌పల్లి, నవాబుపేట మండలాల నుంచి రైతులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

**మీ ఎమ్మెల్యేను ప్రశ్నించండి: కేటీఆర్**

రుణమాఫీపై కాంగ్రెస్ నాయకులను గల్లాపట్టి ప్రశ్నించాలని కేటీఆర్ ప్రజలకు సూచించారు. ఎటువంటి కొర్రీలు లేకుండా ప్రతి రైతుకూ రూ.2 లక్షల మాఫీ చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసిందని మీ ఎమ్మెల్యే కాలె యాదయ్య ఆ పార్టీలో చేరారో నిలదీయాలన్నారు. ఇటీవల చేవెళ్ల పర్యటనలో ఈ ప్రాంతానికి చెందిన రవీందర్‌రెడ్డి అనే వ్యక్తి కేసీఆర్ సీఎంగా లేకపోవడంతో మా ప్రాంతం కళ తప్పిందన్నాడని గుర్తుచేశారు. ఈ ప్రాంతంలోని పరిశ్రమల ఉత్పత్తులను ప్రపంచానికి పరిచయం చేసిన ఘనత బీఆర్‌ఎస్‌దే అన్నారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక మా బతుకులు ఆగమయ్యాయని ప్రజలు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు.

**అభివృద్ధి ఘనత కేసీఆర్‌దే: మహమూద్ అలీ**

రైతుల కోసం పనిచేసిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అని మాజీ ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం అధికారంలో ఉంటే రైతులకు అన్యాయం జరిగేది కాదన్నారు. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చారని ఆరోపించారు. గుజరాత్ మోడల్ సైతం తెలంగాణ రాష్ట్రం ముందు ఎందుకూ పనికి రాదన్నారు.

**ఉద్యమానికి సిద్ధమవ్వాలి: స్వామిగౌడ్**

కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు అధికారంలో ఉన్నా ప్రజలను మోసం చేస్తూనే ఉంటుందని మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ మండిపడ్డారు. ప్రభుత్వంపై ఉద్యమించేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పార్టీ మారిన నాయకులను మళ్లీ చేర్చుకోవద్దని కేటీఆర్‌ను కోరారు. ఉద్యమకారులనే నాయకులుగా తయారు చేసుకుందామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్, నాయకులు ఎం బాల్‌రాజ్, ఆంజనేయులు, అవినాష్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, నారాయణ, దశరథ్, స్వప్న, కౌశిక్‌రెడ్డి, నాగేందర్‌గౌడ్, నర్సింహారెడ్డి, నర్సింలు, యాదగిరి, శివప్రసాద్, చందు, వెంకటేశ్, చంద్రశేఖర్, నర్సింగ్‌రావు, చంద్రశేఖర్‌రెడ్డి, మాధవ్ గౌడ్, దండు సత్తి, మల్లేశ్, ముకుందం గౌడ్, రాంప్రసాద్, కృష్ణారెడ్డి, వెంకటేశ్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

### కేసీఆర్ మార్క్‌ను చెరిపేయలేరు

**మాజీ మంత్రి సబితారెడ్డి**

రాష్ట్రంలో దారుణమైన పాలన సాగుతోందని.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. జిల్లా వ్యాప్తంగా 2.80లక్షల మంది రైతులకు గాను కేవలం 70వేల మందికే మాఫీ అయ్యిందన్నారు. ముఖ్యమంత్రి స్వగ్రామంలో సర్వే కోసం వెళ్లిన మహిళా జర్నలిస్టుపై దాడి చేయడం దారుణమన్నారు. సూర్యచంద్రులు ఉన్నంత కాలం, తెలంగాణ పదం ఉన్నంత కాలం కేసీఆర్ మార్క్‌ను ఎవరూ చెరిపేయలేరన్నారు. గ్రామాల్లోని బీఆర్‌ఎస్ నాయకులు రుణమాఫీ కాని రైతుల వివరాలు సేకరించి ఆ కాగితాలు ఇంద్రారెడ్డి విగ్రహం వద్ద పెట్టి అలాగే వెళ్లే ముఖ్యమంత్రికి అందజేద్దామని అన్నారు.

# ఓటు నమోదు చేసుకోండి

- నవంబర్ 28 వరకు అవకాశం
- ఆర్డీఓ శ్రీనివాసరావు



ఓటరు నమోదుపై పలు పార్టీల నాయకులతో చర్చిస్తున్న ఆర్డీఓ

**తాండూరు టౌన్:** అర్హులైన యువతీ, యువకులు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని తాండూరు ఆర్డీఓ శ్రీనివాసరావు సూచించారు. గురువారం పలు పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా జనవరి ఒకటి 2025 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలని సూచించారు. అక్టోబర్ 29 నుంచి నవంబర్ 28వ తేదీ లోగా ఆన్‌లైన్ లేదా ఆఫ్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందుకోసం ప్రతి శని, ఆదివారాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆన్‌లైన్ అయితే మీ సేవా కేంద్రంలో, ఆఫ్‌లైన్ అయితే 6, 7, 8 ఫారాన్ని నింపి తహసీల్దార్ కార్యాలయం లేదా బీఎల్‌ఓలకు అందజేయాలన్నారు. కొత్త ఓటర్ల నమోదుకు నాయకులు సహకరించాలని కోరారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ తారాసింగ్, టీజేఎస్ కౌన్సిలర్ సోమశేఖర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు హబీబ్ లాలా, బీఆర్‌ఎస్ నాయకులు సలీం తదితరులు పాల్గొన్నారు.

# కేసులు తగ్గేదాకా మెడికల్ క్యాంప్

## జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పల్వన్‌కుమార్



వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న పల్వన్‌కుమార్

**అనంతగిరి:** పీరంపల్లిలో అనారోగ్యానికి గురైన వారు కోలుకునే దాకా వైద్య శిబిరం కొనసాగిస్తామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పల్వన్ కుమార్ తెలిపారు. గురువారం గ్రామంలోని హెల్త్ క్యాంపును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు రోజుల క్రితం 38 మంది అనారోగ్యానికి గురయ్యారని తెలిపారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నారని వివరించారు. 11 మంది నుంచి రక్త నమూనాలు సేకరించడం జరిగిందన్నారు. ఇద్దరిని వికారాబాద్ జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేసినట్లు తెలిపారు. ఈ పరిస్థితికి గల కారణాలు తెలుసుకుంటున్నట్లు చెప్పారు. శిబిరంలోని వారు క్రమంగా కోలుకుంటున్నారని చెప్పారు. ప్రజలు వ్యసనాల బారిన పడరాదని సూచించారు. అలాగే ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. రోడ్లు, బహిరంగ ప్రదేశాల్లో లభించే ఆహార పదార్థాలు తినరాదని సూచించారు. వేడివేడి ఆహార పదార్థాలను మాత్రమే తీసుకోవాలన్నారు. భోజనానికి ముందు, మలవిసర్జన తర్వాత చేతులు సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని తెలియజేశారు. ప్రజలు అధైర్య పడరాదని, ఆరోగ్య సమస్యలు ఎదురైతే గ్రామంలో ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపులో వైద్యం పొందాలన్నారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యుడు సుధాకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



ఈ-ఆఫీస్ వెబ్‌సైట్‌ను ప్రారంభించి వీక్షిస్తున్న కలెక్టర్ శశాంక, అధికారులు

# సకాలంలో పనులు పూర్తవ్వాలి

- రంగారెడ్డి కలెక్టర్ శశాంక

**సాక్షి, రంగారెడ్డిజిల్లా:** మెడికల్ కాలేజీ పనులు సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మహేశ్వరం మెడికల్ కాలేజీ నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేయబోతున్న మెడికల్ కాలేజీలో అన్ని మౌలిక సదుపాయాలు సమకూర్చాలని సూచించారు. ఇప్పటికే నియామకాల ప్రక్రియ పూర్తైందని, మిగిలిన పనులను సైతం వేగంగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీరాములు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవీందర్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ త్రివేణి, సూపరింటెండెంట్ బి.నాగేందర్, జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ జి.రాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రతి ఫైల్ ఆన్‌లైన్‌లోనే..**

జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ ఈ-ఆఫీస్ విధానాన్ని అమలు చేయాలని కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులకు సూచించారు. ఈ మేరకు గురువారం ఆయన అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి ఈ-ఆఫీస్ వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఇకపై కలెక్టరేట్‌లో పేపర్లు, ఫైళ్లు కన్పించొద్దన్నారు. తొలుత వ్యవసాయ శాఖ, ముఖ్య ప్రణాళిక శాఖ, పంచాయతీ రాజ్, మైనారిటీల సంక్షేమ శాఖ, మెప్మా, మహిళా శిశు సంక్షేమం, డీఆర్‌డీఏలలో ప్రారంభించడం హర్షణీయమన్నారు. ఈ ఎనిమిది విభాగాలు ఇకపై ప్రతి ఫైలునూ ఆన్‌లైన్లోనే పంపాలన్నారు. మిగిలిన జిల్లా అధికారులు సైతం మూడు నెలల్లోగా ఈ-ఆఫీస్‌ను అమలు చేయాలన్నారు. దీంతో ఫైల్ ట్రాకింగ్ సులభమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ సంగీత, ఏఓ సునీల్, సీపీఓ సౌమ్య, సాంఘీక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామారావు, మైనార్టీ శాఖ అధికారి నవీన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇంజనీరింగ్ విద్యార్థి దారుణ హత్య

- కత్తితో దాడి చేసిన స్నేహితుడు
- ఛాతి, కడుపు భాగాల్లో పోట్లు
- రక్తపు మడుగులో పడిపోయిన బాధితుడు
- బైక్‌పై పరారైన నిందితులు
- బాలాపూర్ ఠాణా పరిధిలో ఘటన



ప్రశాంత్(ఫైల్)

**పహాడీషరీఫ్:** తోటి స్నేహితుడే ఓ ఇంజనీరింగ్ విద్యార్థిని దారుణంగా హత్య చేశాడు. బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం సాయంత్రం చోటు చేసుకున్న ఈ ఘటన కలకలం రేపింది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లాకు చెందిన శాంతయ్య, అనిత దంపతుల కుమారుడు మొండ్రు ప్రశాంత్ (21) నాదర్‌గుల్‌లోని ఎంవీఎస్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ప్రస్తుతం వీరు బాలాపూర్ గ్రామంలో నివాసం ఉంటున్నారు. గురువారం పరీక్ష ముగిసిన అనంతరం సాయంత్రం 4:30గంటలకు ప్రశాంత్ తన స్నేహితులైన(బీటెక్ క్లాస్‌మేట్స్ కాదు) ముగ్గురితో కలిసి బాలాపూర్ గణేశ్ చౌక్ సమీపంలోని '37 మండీ హౌజ్'కు చేరుకున్నారు. హోటల్ ఆవరణలోని పాన్ షాప్ వద్ద సిగరెట్ కొనుగోలు చేశారు. ఈ సమయంలో మాటామంతీ కొనసాగిస్తున్న క్రమంలో వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో ఆగ్రహానికి లోనైన ఓ స్నేహితుడు అప్పటికే తనవెంట తెచ్చుకున్న కత్తితో ప్రశాంత్ కడుపు, ఛాతి భాగాలలో పొడిచాడు. తీవ్ర రక్త గాయాలతో బాధితుడు కుప్పకూలిపోగా.. మిగిలిన ముగ్గురూ ఒకే బైక్‌పై పరారయ్యారు. సమాచారం అందుకున్న బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ భూపతి ఘటనా స్థలానికి చేరుకుని రక్తపు మడుగులో పడి ఉన్న ప్రశాంత్‌ను ఆస్పత్రికి తరలించే లోపే మృతి చెందాడు. మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, అదనపు డీసీపీ సత్యనారాయణ, ఏసీపీ పి.లక్ష్మీకాంతరెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని, స్థానికులను అడిగి హత్య వివరాలను తెలుసుకున్నారు. క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. ఐటీ, ఎస్‌ఓటీ పోలీసులతో టీంలను ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలిస్తున్నామని డీసీపీ తెలిపారు. కాగా ప్రశాంత్‌ను కత్తితో పొడిచిన యువకుడు సైతం బాలాపూర్‌లోనే నివాసం ఉంటూ ఓ పార్టీ నాయకుడికి అనుచరుడిగా కొనసాగుతున్నట్లు సమాచారం. కాగా నలుగురు యువకులు 0గంజాయి, సిగరెట్లకు బానిసలైనట్లు ప్రాథమికంగా తెలిసింది. కొద్ది రోజులుగా మూతపడి మరమ్మతుల అనంతరం మూడు రోజుల క్రితమే తెరుచుకున్న ఈ హోటల్ వద్ద తరచూ కలుసుకునేవారు. కాగా ఈ హత్యకు ప్రేమ వ్యవహారం ఏదైనా ఉందా..? ఫేమస్ కావాలంటే మర్డర్ చేయాలంటూ నిందితుడు తరచూ స్థానికంగా పేర్కొనేవాడని, దీన్ని బట్టి.. ఫేమస్ కావాలనే హత్య చేశాడా..? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు సాగిస్తున్నారు. ఇదిలా ఉండగా ఈనెల 8న సైతం రౌడీషీటర్ రియాజుద్దీన్ ఇదే పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఉదంతం మరువకముందే మరో హత్య చోటు చేసుకోవడంపై స్థానిక ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. స్టేషన్ పరిధిలో పోలీసులు పెట్రోలింగ్‌ను ముమ్మరం చేసి ఈ ప్రాంతాన్ని నేరరహితంగా తీర్చిదిద్దాలని కోరుతున్నారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి



బైక్‌పై పారిపోతున్న నిందితుల సీసీ ఫుటేజ్

## క్లుప్తంగా

### మొక్కలు నాటి సంరక్షించాలి

ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి



కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ తదితరులు

దౌల్తాబాద్: మానవ మనుగడ, సమస్త ప్రాణి కోటి మనుగడకు మొక్కలు ఎంతో ముఖ్యమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి అన్నారు. గురువారం మండలంలోని మాటూరు గ్రామంలో 'నాటుదాం ఒక చెట్టు- అమ్మ పేరు మీద' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. చెట్లు లేకపోవడం వలన వర్షాలు పడటం లేదని, వానలు సమృద్ధిగా కురవాలంటే చెట్లను పెంచాలని సూచించారు. ప్రభుత్వం వనమహోత్సవం పేరిట మొక్కలు అందజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, ఏపీఓ రజనీకాంత్, టీఏ వెంకటేశ్, పంచాయతీ కార్యదర్శి మల్లేశ్ పాల్గొన్నారు.

### చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య

తాండూరు టౌన్: జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన తాండూరు పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని మల్‌రెడ్డిపల్లికి చెందిన కర్నె రాజు(40) పక్షవాతంతో అనారోగ్యం బారిన పడ్డాడు. చేతిలో పనిలేదు, పని దొరకడం లేదు. దీంతో మనస్తాపం చెందిన రాజు.. బుధవారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. గురువారం ఉదయం స్థానిక మల్‌రెడ్డిపల్లి చెరువులో శవమై తేలాడు. విషయం తెలుసుకున్న పోలీసులు శవాన్ని బయటకు తీసి పంచనామా చేశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

### మంచం పట్టిన పెద్దతండా

సీజనల్ వ్యాధులతో పలువురి చికిత్స



పరిగి ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పెద్దతండా వాసులు

దోమ: వాతావరణ మార్పుల నేపథ్యంలో గిరిజనులు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు. పెద్దతండా పరిధి వాసులు సుమారు 20 మంది ఆరోగ్య సమస్యలతో గురువారం పరిగిలోని వివిధ ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందారు. తండాల్లో అపరిశుభ్రత కారణంగానే విష జ్వరాలు సోకుతున్నాయని, గ్రామాలను ఎవరూ పట్టించుకోవడం లేదని పెద్దతండా-చిన్నతండా వాసులు వాపోయారు. ఇదే విషయమై మండల వైద్యాధికారి రజితను వివరణ కోరగా.. గ్రామంలో నలుగురికి వైరల్ ఫీవర్ వచ్చినట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. శుక్రవారం గ్రామంలో వైద్యశిబిరం నిర్వహిస్తామని ఆమె పేర్కొన్నారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

షాద్‌నగర్‌రూరల్: ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ ఓ వ్యక్తి గురువారం మృతి చెందాడు. ఎస్‌ఐ బల్‌రాం తెలిపిన వివరాల ప్రకారం.. వెంకన్నగూడ గ్రామానికి చెందిన పాత్లావత్ రవి(40) మద్యానికి బానిసై భార్య అమృతతో తరచూ గొడవపడేవాడు. ఈ క్రమంలో మనస్థాపం చెందిన రవి ఈ నెల 2న ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు రవిని షాద్‌నగర్‌లోని కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం వైద్యులు ఉస్మానియాకు రిఫర్ చేశారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. రవి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.





బ్యాంకులో కౌంటర్ వద్ద రైతుల పడిగాపులు



క్యూ కట్టిన అన్నదాతలు

## సార్ ప్లీజ్..

రుణమాఫీ అయిందేమో చూడండి

రుణవిముక్తులను చేస్తుందనుకున్న రుణమాఫీ.. అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తోంది. మూడు విడతలుగా లబ్ధి పొందని రైతులు.. తమకు మాఫీ అయిందో లేదోనని బ్యాంకులకు పరుగులు తీస్తున్నారు. గురువారం తాండూరు పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంకుకు నియోజకవర్గ పరిధి రైతులు భారీగా చేరుకున్నారు. కౌంటర్ల వద్ద క్యూ కట్టారు. రుణమాఫీ అయిందా లేదా జర చూసి చెప్పండి సార్ ప్లీజ్ అంటూ అధికారులను వేడుకున్నారు. ఇదిలా ఉండగా.. ఒక్కసారిగా కర్షకులు అధిక సంఖ్యలో రావడంతో బ్యాంకు సిబ్బంది ఒత్తిడికి గురయ్యారు. – తాండూరు

## విధుల్లో ఉండగా గుండెపోటు



మల్లయ్య పార్థివ దేహం వద్ద నివాళులర్పిస్తున్న శంషాబాద్ డీసీపీ రాజేశ్

- కడ్తాల్ పీఎస్ హెడ్ కానిస్టేబుల్ మల్లయ్య మృతి
- నివాళులర్పించిన డీసీపీ రాజేశ్, నేతలు

ఆమనగల్లు: కడ్తాల్ మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో బుధవారం రాత్రి విధులు నిర్వహిస్తూ గుండెపోటుకు గురైన హెడ్ కానిస్టేబుల్ మల్లయ్య(51) గురువారం ఉదయం మృతిచెందాడు. అర్ధరాత్రి ఒంటిగంటకు ఛాతిలో నొప్పిగా ఉందని చెప్పడంతో తోటి సిబ్బంది మల్లయ్యను



మల్లయ్య (ఫైల్)

స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నగరంలోని డీఆర్‌డీఏ అపోలోకు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అల్మాస్‌గూడకు చెందిన మల్లయ్య 2016 నుంచి కడ్తాల్ పీఎస్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. శంషాబాద్ డీసీపీ రాజేశ్, కడ్తాల్ సీఐ శివప్రసాద్ ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం పోలీసు అధికారిక లాంఛనాలతో అల్మాస్‌గూడలో అంత్యక్రియలు నిర్వహించారు. సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీఎల్ఎన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కంబాల పరమేశ్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, నాయకులు వీరయ్య, లచ్చిరాంనాయక్, బొప్పిడి గోపాల్, చంద్రమౌళి, హరిచంద్‌నాయక్, రామకృష్ణ, లాయక్‌అలీ, వెంకటేశ్, శ్రీకాంత్, బిక్యానాయక్, యాదయ్య తదితరులు కడ్తాల్‌లో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

### సేవాలాల్ సేన జిల్లా ఉపాధ్యక్షుడిగా రాజు



కుల్కచర్ల: సేవాలాల్ సేన జిల్లా ఉపాధ్యక్షుడిగా మండల పరిధి దాస్యనాయక్ తండాకు చెందిన రాజు నాయక్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడారు. సంఘం అభివృద్ధికి కృషి చేయడంతో పాటు, గిరిజనుల సంక్షేమానికి పోరాటం చేస్తామని చెప్పారు.

### తల్లి మరణం తట్టుకోలేక కూతురు మృతి



పోచమ్మ(ఫైల్)



బుచ్చమ్మ(ఫైల్)

యాచారం: తల్లి మరణం తట్టుకోలేక కూతురు మృతి చెందిన సంఘటన మంతన్‌గౌరెల్లి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మంతన్‌గౌరెల్లికి చెందిన కందుల పోచమ్మ(65) అనారోగ్యంతో బుధవారం ఉదయం మృతి చెందింది. పోచమ్మకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. పెద్ద కుమార్తె బుచ్చమ్మ(40)కు అదే గ్రామంలోని బుస్సు క్రిష్ణయ్యతో పెళ్లి చేశారు. బుచ్చమ్మకు తల్లి పోచమ్మ అంటే ఎంతో ప్రేమ ఉండేది. ఈ క్రమంలో అమ్మ మృతిని జీర్ణించుకోలేని ఆమె.. తీవ్ర మనోవేదనకు గురైంది. నీరు, ఆహారం తీసుకోకపోవడంతో అలసటతో అస్వస్థతకు లోనైంది. కుటుంబ సభ్యులు ఆమెను మాల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో చనిపోయింది. 24 గంటల వ్యవధిలో ఇద్దరు తల్లి, కూతురు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి.

### గంజాయి పట్టివేత

యాచారం: కారులో తరలిస్తున్న గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. గురువారం సాయంత్రం నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారి మాల్ చెక్ పోస్టు వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఓ కారును సోదా చేస్తుండగా.. అందులో భారీగా గంజాయి ఉన్నట్లు గుర్తించారు. దానిని స్వాధీనం చేసుకుని, ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.

## దరఖాస్తుల పరిశీలన త్వరగా పూర్తి చేయాలి

అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్



మ్యాప్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

తుక్కుగూడ: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. గురువారం తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రంలో చేపట్టిన దరఖాస్తుల పరిశీలనను ఆమె పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. ఎల్‌ఆర్‌ఎస్ కోసం అర్జీ పెట్టుకున్న ప్లాట్ల వివరాలను సీజీజీ ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని చెప్పారు. మున్సిపాలిటీ పరిధిలో 2541 దరఖాస్తులు రాగా గతంలో 688 పరిష్కరించారని, మిగతా 1853 అప్లికేషన్లను క్రమబద్ధీకరిస్తున్నామని పేర్కొన్నారు. ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపాలిటీ సిబ్బంది సంయుక్తంగా పని చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రాం, ఏఈ కె.భార్గవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### వృద్ధురాలి అదృశ్యం



అంజమ్మ(ఫైల్)

షాద్‌నగర్‌రూరల్: గృహ ప్రవేశానికి వచ్చిన ఓ వృద్ధురాలు అదృశ్యమైంది. ఈ సంఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధి రాయికల్ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌదరిగూడ మండలం వనంపల్లి గ్రామానికి చెందిన బర్ల అంజమ్మ(68) బుధవారం రాయికల్‌లో బంధువుల ఇంట్లో జరిగిన కార్యక్రమానికి వచ్చింది. తిరిగి స్వగ్రామానికి వెళ్లే క్రమంలో ఆమె దారి తప్పింది. గురువారం ఉదయం వరకు ఆమె ఇంటికి చేరలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆమె కోసం వెతికారు. అయినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో గురువారం ఆమె కొడుకు అంజయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ పద్మ తెలిపారు.

## పార్థేనియం మొక్కతో ప్రమాదం

ఏఆర్ఎస్ శాస్త్రవేత్త యమునారెడ్డి




మొక్కలు తొలగిస్తున్న ఏఆర్ఎస్ సిబ్బంది, గ్రామస్తులు

యాలాల: పార్థేనియం మొక్క పంట దిగుబడి తగ్గించడంతో పాటు మనుషులకు శ్వాసకోశ సంబంధిత వ్యాధుల బారిన పడేలా చేస్తుందని తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానం(ఏఆర్ఎస్)శాస్త్రవేత్త యమునారెడ్డి అన్నారు. గురువారం మండల పరిధి ముద్దాయిపేటలో పార్థేనియం కలుపు మొక్క గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పార్థేనియం ఒక కలుపు మొక్క అని, అత్యంత వేగంగా పెరిగి పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందని, అంతే కాకుండా మనుషులు, పశువులకు ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. వీటన్నింటికి పరిష్కారం.. మొక్కలను తొలగించడం లేదా నిర్మూలించడమేనని వెల్లడించారు. ఈ మొక్కలపై గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ప్రచారం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణయ్యగౌడ్, ఆర్ఏడబ్ల్యూఈపీ విద్యార్థులు వివేక్, భానుతేజ, రాము, భరత్, రాహుల్, అరవింద్, గ్రామస్తులు ఉన్నారు.

### లక్ష్యం ఉన్నతంగా ఉండాలి

డీఎస్పీ బాలకృష్ణా రెడ్డి





కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ

తాండూరు టౌన్: విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాన్ని ఎంచుకుని, దానికి సాధించే దిశగా ముందుకు సాగాలని డీఎస్పీ బాలకృష్ణా రెడ్డి అన్నారు. గురువారం సేవారత్న, సామాజిక కార్యకర్త పెంటప్ప, సంతోష్ కుమార్‌ల సౌజన్యంతో విద్యార్థి నాయకులు దీపక్ రెడ్డిల ఆధ్వర్యంలో తులసీ గార్డెన్‌లో.. వ్యక్తిత్వ వికాసంపై మోటివేటర్ సేవక్ కుమార్ సారథ్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడారు. పట్టుదల, కృషి ఉంటే లక్ష్యం ఏదైనా సాధించవచ్చని, క్రమశిక్షణ, నైతిక విలువలను అలవర్చుకుంటూ లక్ష్యం వైపు పయనించాలని సూచించారు. అనంతరం సేవక్ కుమార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలో ఏదో ఒక సృజనాత్మకత దాగి ఉంటుందని, దానికి పదునుపెట్టి అనుకున్నది సాధించాలని చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ దాడులు.. ఇద్దరు అరెస్ట్



పోలీసుల అదుపులో సారా విక్రయిస్తున్న వ్యక్తి

ఆమనగల్లు: ఆమనగల్లు ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధి కడ్తల్ మండల పరిధిలో గురువారం ఎక్సైజ్ సీఐ బద్యానాద్‌చౌహాన్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ సోదాల్లో 5 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేశారు. మైసిగండిలోని మైసమ్మ దేవాలయం వద్ద తనిఖీలు చేస్తుండగా.. మాడ్గుల మండలం కాట్రావత్‌తండాకు చెందిన కోటియా వద్ద నాలుగు లీటర్ల నాటుసారా, తలకొండపల్లి మండలం తాల్లగుట్ట తండాకు చెందిన రాత్లావత్‌బిచ్చా వద్ద 1 లీటర్ సారాను పట్టుకుని, ఇద్దరిని అరెస్టు చేశామని సీఐ తెలిపారు. కడ్తాల్ తహసీల్దార్ ముంతాజ్ ఎదుట ఆరుగురిని బైండోవర్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. మైసమ్మ ఆలయం సమీపంలోని ఫాంహౌస్‌లు, రిసార్ట్స్‌లు, ఫంక్షన్‌హాళ్లలో అనుమతి లేకుండా మద్యం ఈవెంట్లు నిర్వహిస్తే నిర్వాహకులతో పాటు సంబంధిత హాల్స్ యజమానులపై చర్యలు తీసుకుంటామని సీఐ చౌహాన్ హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ స్వప్న, హెడ్‌కానిస్టేబుల్ శంకర్, సిబ్బంది దశరథ్, శ్రీజ, ప్రవీణ్, లోక్యా, రాంరెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదు చేసినా పట్టించుకోరా?





పోలీస్ స్టేషన్ ముందు మాలతి

హస్తినాపురం: ఇంటి అద్దె కోసం వెళ్తే కులం పేరు అడిగి ఎస్సీలకు అద్దెకివ్వమని అవమానకరంగా మాట్లాడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేస్తే.. పోలీసులు పట్టించుకోవడంలేదని ఓ మహిళ ఆరోపించింది. ఈ సందర్భంగా బాధితురాలు కమటం మాలతి విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 18న కూతురు ఆకాంక్ష, ఆమె స్నేహితురాలితో కలిసి వనస్థలిపురం ప్రశాంత్‌నగర్‌లోని దాసరి ఉద్ధానయ్య ఇంట్లో అద్దె కోసం వెళ్లగా.. రూ.22 వేలు కిరాయి అని చెప్పారు. ఆ తర్వాత ఉద్దానయ్య మా కూతురు ఆకాంక్షను కులం అడగగా ఎస్సీ అని చెప్పింది. దీంతో అతను ఇల్లు అద్దెకివ్వమని చెప్పడంతో నా కూతురు మనస్తాపానికి గురైందని తెలిపారు. అదే రోజు వనస్థలిపురం పోలీసులకు ఫిర్యా చేశాను. తర్వాత వెళ్లి అడిగితే నా దృష్టికి రాలేదని ఇన్‌స్పెక్టర్ చెప్పారు. తిరిగి మరోసారి మార్చి ఈ నెల 20న మరో ఫిర్యాదు రాయించి ఇచ్చానని ఆమె చెప్పారు. ఐదు రోజులుగా ఠాణా చుట్టూ తిరిగినా ఎవరూ పట్టించుకోవడం మాలతి ఆరోపించింది. గంటల తరబడి ఠాణాలో కూర్చోబెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్న పోలీసులపై చర్యలు తీసుకోవాలని, లేదంటే పోలీస్‌స్టేషన్ ముందే ఆత్మహత్య చేసుకుంటామని బాధితురాలు మాలతి ఆవేదన వ్యక్తంచేశారు.

## విప్లవం కోసం అడవికి..

# విగతజీవిగా ఇంటికి

- అన్యాయంగా చంపేశారంటున్న కుటుంబ సభ్యులు
- అంతర్గత విషయాలు బయటకొస్తాయనే హత్య చేశారని ఆరోపణ
- న్యూఇందిరానగర్‌లో విషాదఛాయలు
- సాయిబాబానగర్ శ్మశానవాటికలో ముగిసిన అంత్యక్రియలు



రాధ అలియాస్ నీల్సో పార్థివదేహం

కాప్రా: విప్లవం కోసం ఉద్యమంలోకి వెళ్లిన మహిళా మావోయిస్టు పల్లెపాటి రాధ అలియాస్ బంటి రాధ అలియాస్ నీల్సో జీవితం విషాదాంతంగా ముగిసింది. కాప్రా సర్కిల్, న్యూ ఇందిరానగర్‌కు చెందిన రాధ డిప్లొమా ఇన్ ల్యాబొరేటరీ టెక్నాలజీ పూర్తి చేసింది. అనంతరం విప్లవంపై ఆకర్షితురాలై అడవిబాట పట్టిన రాధ తిరిగి విగతజీవిగా ఇంటికి చేరింది. ఇన్‌ఫార్మర్ నెపంతో సహచర మావోయిస్టులే ఆమెను హత్య చేశారు. ఓ మహిళా మావోయిస్టును తోటి మావోయిస్టులే హతమార్చడం గమనార్హం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, చెన్నాపురం అటవీప్రాంతంలో వెలుగు చూసిన ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. రాధ మరణవార్త విన్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గురువారం ఉదయం రాధ భౌతికకాయాన్ని ఇందిరానగర్‌లోని ఇంటికి తీసుకొచ్చారు. ఆరేళ్ల క్రితం ఇంటి నుంచి బయటికి వెళ్లిన కుమార్తె విగత జీవిగా తిరిగి ఇంటికి చేరడంతో తల్లిదండ్రుల రోదనలతో స్థానికంగా విషాదఛాయలు అలుముకున్నాయి. సాయిబాబానగర్‌లోని శ్మశానవాటికలో రాధ అలియాస్ నీల్సో దహన సంస్కారాలు పూర్తి చేశారు.

### అన్యాయంగా చంపేశారు

మావోయిస్టుల అంతర్గత విషయాలు బయటకొస్తాయనే రాధను అన్యాయంగా చంపేశారని ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపిస్తున్నారు. విప్లవ బాటపట్టిన మావోయిస్టుల్లోనూ అగ్రవర్ణాలు, అణగారిన వర్గాలు అనే తారతమ్యం చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దళిత కుటుంబానికి చెందని ఆడబిడ్డనే రాధను సహచర మావోయిస్టులు చంపేశారని ఆరోపిస్తున్నారు. మావోయిస్టుల్లో కొందరు చేసిన తప్పులను రాధ ప్రశ్నించిందని, వారి గుట్టు బయటపడుతుందనే భయంతోనే చంపేశారని చెబుతున్నారు. రాధ ఇన్‌ఫార్మర్‌గా మారిందనడానికి ఆధారాలు ఏమున్నాయని ప్రశ్నిస్తున్నారు. ఆరేళ్లుగా లేని అనుమానం ఇప్పుడే ఎందుకు వచ్చింది, మూడు నెలల క్రితం కమాండర్ బాధ్యతల నుంచి తప్పిస్తే అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎందుకు ఆగారు అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమకు జరిగిన అన్యాయంపై స్పందించాలని తమ కుటుంబాన్ని ఆదుకోవాలని రాధ కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.

### దళిత మహిళ అనే వివక్ష



ఒక దళిత కుటుంబానికి చెందిన ఆడబిడ్డనే మా చెల్లెను అన్యాయంగా చంపేశారు. ఇన్‌ఫార్మర్ నెపంతో సహచర మావోయిస్టులే చంపి రోడ్డుపై పడేశారు. విషయం తెలుసుకుని అక్కడికి వెళ్తే మృతదేహం కోసం చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాం. అక్కడ ఏరియా ఆస్పత్రికి మేం వెళ్లేసరికే రాధ మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి చేశారు. అసలు తల్లిదండ్రులు లేకుండా వారికి సమాచారం అందించకుండా, తల్లిదండ్రుల అనుమతి లేకుండా రాధ మృతదేహానికి పోస్టుమార్టం ఎలా చేస్తారు.

-లింగం, రాధ అన్నయ్య.

### నా బిడ్డను చూస్తా అనుకున్నా




మూడు రోజుల్లో నా బిడ్డ ఇంటికొస్తుందని తెలిసింది. చాలా ఏళ్ల తర్వాత నా బిడ్డను చూస్తా అనుకున్నా. అంతలోనే రెండు రోజుల తర్వాత చనిపోయిందని చెప్పారు. బిడ్డ ఇక లేదని తెలియడంతో చివరి చూపుకోసం బుధవారం మధ్యాహ్నం అక్కడికి బయలుదేరాం. మేం వెళ్లేసరికే పోస్టుమార్టం పూర్తి చేశామని చెప్పి, మృతదేహాన్ని అప్పగించేశారు. ఇన్‌ఫార్మర్ పేరుతో నా బిడ్డను అన్యాయంగా చంపేశారు. నా కొడుకుపై కూడా ఆరోపణలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి మా కుటుంబాన్ని ఆదుకోవాలి.

-పోచమ్మ(బాలమ్మ), రాధ తల్లి



విలపిస్తున్న రాధ తండ్రి బాలయ్య

### ఇన్‌ఫార్మర్ అనడం అబద్ధం



మా అక్క రాధను ఇన్‌ఫార్మర్ అని చెప్పడం పచ్చి అబద్ధం. ఆరేళ్ల క్రితం మావోయిస్టుల పార్టీలో చేరిన అక్క ఫ్యామిలీ గుర్తుకు వచ్చినప్పుడు కేవలం మెసేజ్ మాత్రం చేసేది. అది కూడా ఆమె వెళ్లిన తర్వాత రెండేళ్ల క్రితం ఒక్క మెసేజ్ చేసింది. ఎలా ఉన్నారు, అమ్మ, నాన్న ఎలా ఉన్నారు అని ఆరా తీసింది. మేం బాగానే ఉన్నాం, నువ్వు ఇంటికి రావొచ్చు కదా అంటే నన్ను మర్చిపోండి, నేను మావోయిస్టుల్లోనే ఉంటానని చెప్పింది. అలాంటి మా అక్క ఇన్‌ఫార్మర్ అని ముద్ర వేసి అన్యాయంగా చంపేశారు. ఆ తర్వాత ఈ నెల 18న నాకు మెసేజ్ వచ్చింది. కానీ ఆ మెసేజ్ చేసింది మా అక్క కాదని గుర్తించా. అక్కకు ఏం జరిగిందోననే భయంతో మాకు తెలిసిన వ్యక్తి ద్వారా ఆరా తీశా. ఆ తర్వాతి రోజునే చనిపోయిందని తెలిసింది. ఈ నెల 21న చనిపోయిందని ఫొటో వాట్సాప్ చేశారు. కానీ ఆ ఫొటోలో 19వ తేదీ కనిపించింది. అంటే మా అక్క చనిపోయిన తర్వాత రెండు రోజులకు మాకు సమాచారం అందింది. నాకు డబ్బులు పంపేదని ఆరోపిస్తున్నారు. అలా అయితే నేను క్యాబ్ డ్రైవర్‌గా ఎందుకు పని చేస్తాను.

-సూర్యప్రకాశ్, రాధ తమ్ముడు

### నేషనల్ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతగిరి: నేషనల్ స్కాలర్‌షిప్ పథకానికి జిల్లాలో అర్హులైన దివ్యాంగ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మహిళ, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి కృష్ణవేణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరంలో ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్, టాప్ క్లాస్ ఎడ్యుకేషన్ పథకంలో భాగంగా నేషనల్ స్కాలర్‌షిప్ ఆన్‌లైన్ పోర్టల్‌లో ఫ్రెష్, రెన్యువల్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం 9, 10 తరగతుల వారు, పోస్ట్ మెట్రిక్‌కు 11,12 తరగతుల వారు టాప్ క్లాస్ ఎడ్యుకేషన్ కోసం డిగ్రీ, పీజీ, డిప్లమా చదువుతున్న వారు అర్హులన్నారు. ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రీ మెట్రిక్‌కు ఈ నెల 31, పోస్టు మెట్రిక్, టాప్ క్లాస్ ఎడ్యుకేషన్‌కు అక్టోబర్ 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు.

### కొత్త ఓటర్లను నమోదు చేయండి

తహసీల్దార్ వెంకటేశం

బషీరాబాద్: ఇంటింటికీ వెళ్లి అర్హులను గుర్తించి, కొత్తగా ఓటర్లను నమోదు చేయించాలని తహసీల్దార్ వెంకటేశం అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బీఎల్‌ఓలకు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన యువ ఓటర్లను గుర్తించి, ఓటరుగా నమోదు చేయించాలని చెప్పారు. అదే విధంగా జాబితాలో తప్పులు, చిరునామాలు మార్చుట వంటి వారి వివరాలను సేకరించాలని సూచించారు. చనిపోయిన ఓటర్లను గుర్తించి జాబితా నుంచి వారి పేర్లను తొలగించాలని ఆదేశించారు. అనంతరం ఎంపీడీఓ గాలి యాదయ్య మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలకు ఓటరు జాబితాను సిద్ధం చేయాలని పేర్కొన్నారు. వార్డుల వారీగా కార్యదర్శులు ఇంటింటికి వెళ్లి కొత్త ఓటర్లను నమోదు చేయాలన్నారు. వచ్చే నెల 6లోపు వార్డుల వారీగా జాబితా సిద్ధం చేయాలని వెల్లడించారు.